Enlightend by Quran
(Telugu)

ఖుర్‌ఆన్ వెలుగు

రచన
సయ్యద్ సాదతుల్లా హుసేనీ
అనువాదం
అశోక్

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

దివ్యఖుర్‌ఆన్ అద్భుతం...

పద్నాలుగు శతాబ్దాలకు పూర్వం అరేబియా ద్వీపకల్పంలో అనాగరిక పశుకాపరుల తెగలు నివసించేవి. బైజాంటియన్, పర్షియా, ఇండియా, ఈజిప్టు వంటి నాగరికతలు విరాజిల్లిన ఖండంలో కేంద్ర స్థానంలో ఉండి కూడా అరేబియాకు ప్రపంచ పటంలో సాంస్కృతికంగా తగిన గుర్తింపు ఉండేది కాదు. అజ్ఞానం, అనాగరికం, పోట్లాడే తత్వం కారణంగా అరేబియాలో నివసించే తెగలను పాలించలేమని ప్రపంచం లోని నాగరిక దేశాలు భావించేవి. ఆ కారణంగానే ఎవరూ ఆ ప్రాంతాన్ని ఆక్రమించడానికి ప్రయత్నించలేదు.

ప్రపంచ పటానికి మధ్యగా ఉండే అరేబియా ఎడారి ప్రాంతంలోనే ఇస్లాం ధర్మ ప్రవక్త ముహమ్మద్(స) జన్మించారు. ఆయనకి 40 ఏళ్ళు వచ్చేవరకు సాధారణ అరబ్బుగానే జీవించారు. ఆయన శీల సంపదలు, నడవడిక మంచివన్న ఖ్యాతి తప్ప మరే ప్రత్యేకతలు ఆయనకు అప్పట్లో ఆపాదించబడలేదు. దృఢచిత్తం, నిజాయితీ గుణాల కారణంగా ఆయనను అందరూ గౌరవించేవారు. అయితే అంతకు మించి కవిగా, తాత్వికుడిగా, సంస్కర్తగా, సిద్ధాంతకర్తగా ఆయనను ఎవరూ ఊహించనైనా లేదు.

హఠాత్తుగా ఒక రోజు ఆయన హిరా గుహలో నుంచి ఆధ్యాత్మిక ఏకాంతం వీడి బయటికి వచ్చాక, తనకు దైవదూత దర్శనమిచ్చారని, తనపై దైవసందేశం ప్రకటితమైందని తెలిపారు. ఆ దైవ సందేశమే ఖుర్‌ఆన్.

ఖుర్‌ఆన్ అవతరణ

దివ్యఖుర్‌ఆన్ అవతరణ 23 సంత్సరాలపాటు కొనసాగింది. వందలాది మంది ఆయన (స) సహచరులు ఆ సందేశాలని రికార్డు చేసి రాతపత్రులలో భద్రపరిచారు. అంతేకాక కంఠస్తం చేశారు. ఆ దైవసందేశాల సమాహారమైన దివ్య ఖుర్‌ఆన్ గ్రంథాన్ని ఎంతో భద్రంగా తరతరాలుగా కాపాడుతున్నారు. దివ్యఖుర్‌ఆన్ వాక్యాలలో నాటి నుంచి నేటి వరకు లేశమాత్రమూ మార్చకుండా యధాతథంగా ఉంచారన్నది శాస్త్రీయంగా రుజు వయ్యింది.

ఖుర్‌ఆన్ తన అసాధారణ సందేశంతో మానవ చరిత్ర గతినే మార్చేసింది. దానికి ప్రభావితం కాని మానవ సమాజమే లేదు. మైమరిపించే ఖుర్‌ఆన్ వచన భావామృతానికి కవులు, సాహిత్యకారులే చకితులయ్యారు. సరళమైన దివ్యఖుర్‌ఆన్ పాఠం సర్వకాలాల మర్మాలను అద్భుతరీతిలో ఛేదించిందని తాత్వికులు, సిద్ధాంతకర్తలు సైతం విస్మయం చెందారు. 20వ శతాబ్దపు శాస్త్రజ్ఞులు నేడు కొత్తగా కనుగొన్న శాస్త్రీయ వాస్తవాలను సయితం దివ్యఖుర్‌ఆన్ ఎన్నో సంవత్సరాలకు పూర్వమే వెల్లడించడంపై ఆశ్చర్యచకితులయ్యారు.

ప్రసిద్ధ అనాటమిస్ట్ ప్రొఫెసర్ కీత్ ఎల్.మూర్ మాటల్లో...
"మానవాభివృద్ధికి సంబంధించి దివ్యఖుర్‌ఆన్ వివరించిన వాక్యాలు క్రీ.శ. 7వ శతాబ్దంలో కాని లేక వంద ఏళ్లకు ముందు కాని విపులీ కరించడం సాధ్యపడలేదు. నేటి ఆధునిక శాస్త్ర విజ్ఞానంరీత్యా పిండ పరిణామ శాస్త్ర అవగాహనలో ఖుర్‌ఆన్ వాక్యాలను మనం నేడు శాస్త్రీయంగా విపులీకరించడం సాధ్యపడుతున్నది. దివ్యఖుర్‌ఆన్‌లో మానవాభివృద్ధికి సంబంధించిన వాక్యాలు మరికొన్ని ఉన్నాయి. అయితే వాటిని భవిష్యత్తులో మన విజ్ఞానం మరింత పెరిగినప్పుడే విపులీ కరించడం సాధ్యం కాగలదు"

రాజకీయ, ఆర్థిక, నైతిక, సాంస్కృతిక, సామాజిక విషయాలలో ఈ దివ్యగ్రంథం చేసిన నిర్దేశకాలు ఓ కొత్త జీవన విధానం, నవ నాగరికతకు తెరతీసింది. ఈ దివ్యగ్రంథం మానవ మేధస్సు, శాస్త్రాలపై ఎంతో ప్రభావం చూపింది. శాస్త్ర విజ్ఞానంలో, పరిశోధనల్లో విప్లవాత్మక మార్పులొచ్చాయి. ఓ కొత్త యుగమే మొదలయింది. నిరక్షరాస్యులు, సంచార జాతీయులైన అరబ్బులు చివరికి ప్రపంచ మార్గదర్శకులుగా మారారు. అసలుసిసలైన తాత్వికులు, శాస్త్రజ్ఞులు, గణిత శాస్త్రజ్ఞులు, సంస్కర్తలు, రాజకీయ, మిలటరీ నాయకులను వారు తయారు చేశారు. వారి ప్రగతి వేగం అనితర సాధ్యం. దివ్యఖుర్‌ఆన్ గ్రంథం ఏయే దేశా లకు చేరిందో అక్కడి సమాజాలు, నాగరికతలు ప్రభావితమయ్యాయి. ఆ దివ్యగ్రంథ ప్రబోధాల కారణంగా ఓ శతాబ్దంపాటు ప్రపంచ నాగరికత ప్రభావితమయింది. దివ్యఖుర్‌ఆన్ చూపినంతగా మానవ

చరిత్రలో ఏ గ్రంథమూ ప్రభావం చూపలేదు. ఆ గ్రంథాన్ని నమ్మని వారిని సైతం ప్రభావితం చేసింది. వివేచన, విమోచనల విషయంలో నవీనకాంతులీనింది. ఓ కొత్త యుగమే ఆరంభమయింది. సమస్త మానవాళికి సమగ్రంగా, సమర్థవంతంగా మార్గనిర్దేశన చేయగలిగే వనరు ఈ దివ్యగ్రంథం. దాని దార్శనికత సర్వ కాలాలకు తగినది. ప్రస్తుత సమస్యలకు పరిష్కారం చూపగల ప్రత్యేక సూత్రం (ఫార్ములా) ఇప్పటికీ అందులో ఇమిడి ఉంది.

భౌతికంగా మనం ఎంత ప్రగతి సాధించినప్పటికీ ఇంకా అంధ కారంలో కొట్టుమిట్టాడుతున్నాము. ఆర్థిక విబేధాలు, రాజకీయ అనిశ్చితి, యుద్ధాలు, ఘర్షణలు, అణిచివేత, దోపిడి విధానం, అవినీతి, చౌర్యం, కుటుంబాల విచ్ఛిత్తి, పర్యావరణ వినాశనం, మానసిక ఆందో ళనలు, ఉద్రేకపూరిత వాతావరణం వంటివెన్నెన్నో పట్టిపీడిస్తున్నాయి. మనం కలలు కనే స్వర్గానికి దగ్గర కాలేకపోతున్నాము. మానవాళి కోరుకుంటున్న మేలు సాకారం పొందడంలేదు. మానవాళి స్వప్నాన్ని సాకారం చేస్తానని దివ్యఖుర్ఆన్ చెబుతోంది. మరణానంతరం స్వర్గం అందిస్తానని వాగ్దానం చేస్తోంది. అంతేకాదు ఈ భూలోకంలో మన స్వర్గపు స్వప్నం ఎలా సాకారం చేసుకోవచ్చో మార్గనిర్దేశనం చేస్తోంది. దృఢ విశ్వాసాలపై మానవ సమాజాన్ని అది నిర్మిస్తుంది. మానవ చిత్తం, మేధస్సు, శరీరాల మధ్య ఓ సామరస్యాన్ని నిర్మిస్తుంది. వ్యక్తిగత, సామాజిక జీవన విధానంలో ఆధ్యాత్మికతను బలంగా నాటుతుంది.

ప్రతి వ్యక్తిని నియంత్రించే విధానాన్ని తీసు కొస్తుంది. బలమైన పునాదులపైన దివ్యఖుర్ఆన్ నైతిక విలువలను, చట్టబద్ధ తీర్పులను నెలకొల్పుతుంది. స్వీయ నియంత్రణ కలిగిన వ్యక్తుల, క్రమశిక్షణాయుత సమాజాన్ని ఏర్పరుస్తుంది. ఇతర సిద్ధాం తాలు, చట్ట విధానాలు సాధిం చని రీతిలో ఆదర్శాలను ఆచరణలోకి విజయవంతంగా తీసుకొస్తుంది ఖుర్ఆన్.

అందరికీ న్యాయం - దివ్యఖుర్ఆన్ ధ్యేయం

మనం కలలు కనే ప్రపంచానికి ముఖ్య అడ్డంకి అన్యాయం. మనల్ని బాధిస్తున్న అనేక సామాజిక రుగ్మతల మూలాలు అన్యాయం లోనే దాగి ఉన్నాయి. మన మనఃసాక్షి కోరుకునే ప్రపంచం సాకారం పొందాలంటే కావలసిన మొట్టమొదటి ఆవశ్యకత మానవ జీవితపు అన్ని దశలలో నిర్దిష్టమైన, రాజీలేని న్యాయం జరుగడమే.

దివ్యఖుర్ఆన్ కోరుకునే ఆదర్శ సమాజానికి కావలసిన ముఖ్యాంశం న్యాయం. న్యాయబద్ధంగా వ్యవహరించమని తన అను చరులను ఖుర్ఆన్ కోరుతోంది. న్యాయాన్ని, న్యాయంగా ఉండేవారినే దేవుడు ప్రేమిస్తాడని దివ్యఖుర్ఆన్ ప్రకటించింది.

> .... న్యాయం చేయండి, ఎందుకంటే అల్లాహ్ న్యాయం చేసే వారిని ప్రేమిస్తాడు. *(దివ్యఖుర్ఆన్ 49 :9)*

న్యాయమన్నది డిమాండ్ చేస్తే ఇచ్చేది కాదు. బలవంతపెట్టడం

వల్ల అందించేదీ కాదు. ప్రతీ వ్యక్తి స్వచ్ఛందంగా న్యాయం చేయాలి. దివ్యఖుర్‌ఆన్ ఇప్పటికే విశ్వాసాల ద్వారా స్వీయ నియంత్రణను ఏర్పాటు చేసింది.

> ముస్లిములారా! అమానతు (అప్పగింత) లను యోగ్యులైన వారికి అప్పగించండి. ప్రజల మధ్య తీర్పు చేసేటప్పుడు న్యాయంగా చేయండి. *(దివ్యఖుర్‌ఆన్ 4 : 58)*

> విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్ కొరకు సత్యంపై స్థిరంగా ఉండండి. న్యాయానికి సాక్షులుగా ఉండండి. (ఏదైనా) వర్గంతో ఉన్న వైరం కారణంగా మీరు ఆవేశానికి లోనయి న్యాయాన్ని త్యజించకండి. న్యాయం చేయండి. ఇది దైవభక్తికి సరిసమానమైనది. *(దివ్యఖుర్‌ఆన్ 5 : 8)*

బలమైన భావోద్వేగాలకు లోనయి ఉన్నప్పుడు కూడా న్యాయమే చేయమని తన అనుచరులను దివ్యఖుర్‌ఆన్ కోరుతోంది. సాధారణ పరిస్థితులలో న్యాయం చెప్పుకోదగ్గ డిమాండ్‌గా ఉండదు, కాని బలమైన సెంటిమెంట్లు, ప్రేమ, ద్వేషాలు వంటివి ఎదురయినప్పుడు న్యాయం చేయడమన్నది అంత సులువైన విషయం కాదు. విశ్వాసాధికారంతో ఖుర్‌ఆన్ అలాంటి స్థితిలో సైతం మనిషిని న్యాయం ఆచరించేలా చేస్తుంది.

> "విశ్వసించిన ప్రజలారా! న్యాయ ధ్వజవాహకులుగా నిలబడండి. అల్లాహ్ కొరకు సాక్షులుగా ఉండండి. మీ న్యాయం, మీ సాక్ష్యం

మీకూ, మీ తల్లిదండ్రులకూ, మీ బంధువులకూ ఎంత హాని కలిగించినా సరే. కక్షిదారులు భాగ్యవంతులయినా, నిరుపేద లయినా అల్లాహ్ వారి శ్రేయస్సును మీకంటే ఎక్కువగా కాంక్షి స్తాడు. కనుక మీ మనోవాంఛలను అనుసరిస్తూ న్యాయం నుండి వైదొలగకండి. మీరు గనుక సాక్ష్యాన్ని వక్రీకరిస్తే, న్యాయాన్ని దాటవేస్తే, బాగా తెలుసుకోండి. మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు అని." *(దివ్యఖుర్ఆన్ 4 : 135)*

దివ్యఖుర్ఆన్ తన అనుచరులను న్యాయంగా ఉండమనే కాదు న్యాయం చేయమనీ కోరుతోంది. న్యాయానికి మార్గదర్శులు కమ్మంటోంది. న్యాయం కోసం నిలబడమంటోంది. ఏ జాతి, తెగకైనా, సముదాయానికైనా అన్యాయంజరిగితే అవిశ్రాంతంగా పోరాడ మంటోంది. అణగ ద్రొక్కబడిన వారి వైపే ఎల్లప్పుడూ ఉండమని కోరుతోంది.

"మేము మా ప్రవక్తలను స్పష్టమైన సూచనలతో, హితోపదేశా లతో పంపాము. వారితోపాటు గ్రంథాన్నీ, త్రాసునూ అవతరింప జేశాము; ప్రజలు న్యాయంపై స్థిరంగా నిలబడాలని..."

(దివ్యఖుర్ఆన్ 57 : 25)

బలమైన విశ్వాసాన్ని పునాదిగా చేశాక, న్యాయానికి ప్రాముఖ్యత నిచ్చింది దివ్యగ్రంథం. న్యాయం చేయమని దివ్యఖుర్ఆన్ నిర్ద్వంద్వంగా తెలిపింది.

సంపూర్ణ సమానత్వం ఖుర్‌ఆన్ ధ్యేయం

రాజకీయ, సామాజిక విషయాల్లో సంపూర్ణ సమానత్వం ఉండాలంటుంది ఖుర్‌ఆన్. సమానత్వం అన్నది లేకుంటే న్యాయాన్ని పొందలేము.

ప్రతి మనిషి ఒకే కుటుంబం నుంచి, ఆదం హవ్వల జంట నుంచే వచ్చారని ఖుర్‌ఆన్ తెలిపింది. ప్రతి ఒక్కరూ ఒకే జంట నుంచి వచ్చినప్పుడు జాతి, తెగ వంటి ఆధిపత్యానికి, హెచ్చుతగ్గులకు తావే లేదంటుంది. ప్రతి ఒక్కరు ఉమ్మడి ప్రయోజనాలు, ఉమ్మడి బాధ్యతలు పంచుకోవాలంటుంది.

> "మానవులారా! మీ ప్రభువుకు భయపడండి. ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణి నుండి పుట్టించాడు. ఇంకా ఆ జంట ద్వారా ఎంతో మంది పురుషులను, స్త్రీలను అవనిలో వ్యాపింపజేశాడు."
>
> *(దివ్యఖుర్‌ఆన్ 4 :1)*

> "మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండి, ఒకే స్త్రీ నుండి సృజించాము. తరువాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగానూ, తెగలుగానూ చేశాము. వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు. నిశ్చయంగా అల్లాహ్ సర్వజ్ఞానంకలవాడు, సకల విషయాలూ తెలిసిన వాడూను." *(దివ్యఖుర్‌ఆన్ 49 :13)*

రంగు, జాతి, తెగ, ప్రాంతం వంటి తేడాలేమీ లేకుండా పౌరులందరికీ భద్రత, న్యాయం కల్పించడమే ఖుర్ఆన్ పేర్కొనే ఆదర్శ ప్రభుత్వ లక్ష్యం.

ఆత్మప్రబోధాన్ని, మత స్వేచ్ఛని, భావస్వేచ్ఛని ప్రతి పౌరుడికి అందించాలంటుంది దివ్యఖుర్ఆన్

"ధర్మం విషయంలో నిర్బంధంకానీ, బలాత్కారం కానీ లేవు."

(దివ్యఖుర్ఆన్ 2 :256)

వర్గ పోరాటాలు, తెగ, జాతి వైషమ్యాలు లేని సమాజంలో న్యాయం సాధ్యం. విశ్వ మానవ సమానత్వం అన్న సిద్ధాంతంపై సమాజం ఏర్పడాలనే విషయంలో దివ్యఖుర్ఆన్ సాటిలేని విజయం సాధించింది.

ఆర్థిక విషయాల్లో ఖుర్ఆన్ న్యాయం ఏమిటంటే పరిమిత యాజమాన్యం, పరిమిత ట్రస్టీషిప్ మాత్రమే ఉంటాయి. అన్నింటికీ అసలైన యజమాని దైవమనీ, మనిషి కేవలం ట్రస్టీ అని ఖుర్ఆన్ పేర్కొంటుంది.

"ఆకాశాలలో, భూమిలో ఉన్నదంతా అల్లాహ్‌దే. అల్లాహ్ ప్రతి వస్తువును పరివేష్టించి ఉన్నాడు." *(దివ్యఖుర్ఆన్ 4 :126)*

"రాత్రి చీకటిలో, పగటి వెలుగులో నిలిచేది అంతా అల్లాహ్‌దే. ఆయన అన్నీ వింటాడు. అన్నీ తెలిసినవాడు." *(ఖుర్ఆన్ 6 :13)*

దివ్యఖుర్‌ఆన్ ఆర్థిక విధానం

"అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్తనూ విశ్వసించండి. ఆయన మిమ్మల్ని ఏ వస్తువులపై ఖలీఫా (ప్రతినిధి)గా నియమించాడో, వాటిలో నుండి ఖర్చు పెట్టండి. మీలో విశ్వసించి ధనం ఖర్చు పెట్టేవారికి గొప్ప ప్రతిఫలం లభిస్తుంది." *(దివ్యఖుర్‌ఆన్ 57:7)*

అంటే ప్రతి వ్యక్తికి ఆర్థిక వ్యవహారాలు నిర్వహించుకునే స్వేచ్ఛ ఉంది. ప్రయోజన ఫలాలు పొందే హక్కుంది. కానీ అతడు సమాజ శ్రేయస్సు, బీదలు, అగత్యపరుల అవసరాలు చూడాలి.

ధనవంతుల సంపదలో పేదలు, అగత్యపరుల హక్కు ఉందని దివ్యఖుర్‌ఆన్ తెలిపింది.

"వారి (ధనవంతుల) సంపదలో యాచకులకూ అగత్యం కల వారికీ హక్కు వుండేది." *(దివ్యఖుర్‌ఆన్ 551 : 19)*

ధనవంతులలోనే సంపద ప్రవహించకుండా ఉండేలా ఖుర్‌ఆన్ ఆర్థిక విధానాన్ని నిర్దేశించింది. సంపద అన్నది ధనవంతుల నుంచి పేదలలోకి వెళ్ళాలి.

ఖుర్‌ఆన్ ఆర్థిక నీతి ఏమిటంటే సంపద మొత్తం ఒకేచోట కేంద్రీకృతం కాకుండా చూపడం, ఆర్థిక దోపిడిని నివారించడం.

జకాత్, స్వచ్ఛంద దానాలు (సదఖా) సర్వకాలాల్లో బలంగా కొనసాగేలా ఖుర్‌ఆన్ ఆదేశించింది. సంపద పంపిణీ వల్ల సమాజంలో ఆర్థిక న్యాయం నెలకొనేలా చూస్తోంది.

"అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టండి. చేతులారా మిమ్మల్ని మీరు వినాశనంపాలు చేసుకోకండి. మేలు చెయ్యండి. మేలు చేసేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు." *(దివ్యఖుర్ఆన్ 2 : 195)*

ఈ సకారాత్మక చర్యలేకాక దోపిడి, సంపద పోగు చేసుకునే చర్యలను అణిచివేసే చర్యలు కూడా ఖుర్ఆన్ పేర్కొంది. వడ్డీ అనేది ఆర్థిక దోపిడీకి ఓ మార్గం. దివ్యఖుర్ఆన్ వడ్డీని పూర్తిగా నిషేధించింది. ఆర్థిక దోపిడికి మార్గాలైన లంచం, అక్రమ నిల్వలు, జూదం, సట్టా వ్యాపారం వగైరాలను నిషేధించింది.

"వెండి బంగారాలను పోగుచేసి వాటిని దైవమార్గంలో ఖర్చు పెట్టని వారికి వ్యధాభరితమైన శిక్ష యొక్క శుభవార్తను అందజెయ్యండి." *(దివ్యఖుర్ఆన్ 9 : 34)*

"వడ్డీ తినేవారి స్థితి షైతాను పట్టడం వల్ల ఉన్మాది అయిన వ్యక్తి స్థితిలాంటిది. ఈ స్థితికి వారు గురికావటానికి కారణం వారు 'వ్యాపారం కూడా వడ్డీలాంటిదేగా'అని అనటమే. వాస్తవానికి అల్లాహ్ వ్యాపారాన్ని ధర్మసమ్మతం (హలాల్) చేశాడు. వడ్డీని నిషిద్ధం (హరామ్) చేశాడు. కనుక తన ప్రభువు చేసిన ఈ హితబోధ అందే వ్యక్తి ముమ్ముందు వడ్డీ తినటం త్యజిస్తే, అతను పూర్వం తిన్నదేదో తిన్నాడు. అతని వ్యవహారం చివరకు అల్లాహ్ వద్దకే పోతుంది. ఈ ఆదేశం తరువాత మళ్ళీ ఈ దుశ్చేష్టకు పాల్పడేవాడు నిశ్చయంగా నరకవాసి. అక్కడ అతడు శాశ్వతంగా ఉంటాడు." *(దివ్యఖుర్ఆన్ 2 : 275)*

"విశ్వాసులారా! సారాయి, జూదం, దైవేతర మందిరాలు, పాచికల ద్వారా జోస్యం - ఇవన్నీ అసహ్యకర షైతాన్ పనులు. వాటిని విసర్జించండి." *(దివ్యఖుర్ఆన్ 5 : 90)*

క్లుప్తంగా చెప్పాలంటే ఆదర్శవంతమైన సమాజ స్థాపనకు ఖుర్ఆన్‌లో సమగ్ర ప్యాకేజీ ఉంది. బలమైన విశ్వాసాలు, విలువలు, నైతికతలు, నియంత్రణలతో అది న్యాయాన్ని అందిస్తుంది. చివరగా ఇక్కడ కవి కోకిల శ్రీమతి సరోజినినాయుడు రాసింది ఉటంకిస్తున్నాము:

"న్యాయమన్నది ఇస్లాం ఆదర్శాలలో ఒకటి. నేను దివ్యఖుర్ఆన్ చదివినప్పుడు గొప్ప జీవన సిద్ధాంతాలు చూశాను. ప్రపంచమంతటికీ నిజ జీవితంలో ఆచరణీయమైన నైతికతలే అందులో ఉన్నాయి." (స్పీచెస్ అండ్ రైటింగ్స్ ఆఫ్ సరోజినినాయుడు, మద్రాస్, 1918, పేజీ 167)

ప్రపంచ శాంతియే దివ్యఖుర్ఆన్ ధ్యేయం. న్యాయానికి, శాంతికి మధ్య అవినాభావ సంబంధం ఉంది. న్యాయమైన సమాజం ఎల్లప్పుడూ స్థిరమైన, శాంతియుతమైన సమాజమే అయి ఉంటుంది. శాంతికి పునాది న్యాయమేనంటుంది ఖుర్ఆన్. ఖుర్ఆన్ ముఖ్యాంశాలలో న్యాయం, శాంతి ఉన్నాయి. ఇస్లాం ధర్మం బోధించేది శాంతియే.

"అల్లాహ్ మిమ్మల్ని దారుస్సలాం వైపునకు ఆహ్వానిస్తున్నాడు. (మార్గదర్శకత్వం ఆయన చేతుల్లోవుంది) ఆయన తాను కోరిన

వారికి సరిఅయిన మార్గం చూపుతాడు."

(దివ్యఖుర్‌ఆన్ 10 : 25,26)

మంచికి దక్కే చివరి ఫలం శాంతి.

"..... వారు అవలంభించిన సరైన ప్రవర్తన కారణంగా వారి ప్రభువు వద్ద వారి కొరకు శాంతి నిలయం ఉంది."

(దివ్యఖుర్‌ఆన్ 6 : 127)

శాంతికి విఘాతం కలిగించేదే అలజడి. ఇలాంటి అలజడి, కల్లోలాలను ఖుర్‌ఆన్ అనేక సందర్భాలలో ఖండించింది.

"...అతడు లోకంలో కల్లోల వ్యాప్తికీ, పంట పొలాల విధ్వంసానికీ, మానవ సంతతి వినాశనానికీ నిత్యం కృషి చేస్తాడు. - (అతడు సాక్షిగా నిలబెట్టే) అల్లాహ్ కల్లోలాన్ని ఏమాత్రం సహించడు. *(దివ్యఖుర్‌ఆన్ 2 : 205)*

న్యాయానికి కావలసిన విధంగానే శాంతికి, ఓ వైఖరి, రీతి అవసరం. ఒకవేళ పరాయితనం అనే భావన ప్రజలని కూడా విభజిస్తే, శాంతికి విఘాతం కలుగుతుంది. మనుషులంతా ఒక్కటే అన్నది ఖుర్‌ఆన్ నినాదం. శాంతియుత సమాజానికి ఆ నమ్మకమే గట్టి పునాది.

"మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండి, ఒకే స్త్రీ నుండి సృజించాము. తరువాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగానూ, తెగలుగానూ చేశాము.

వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు. నిశ్చయంగా అల్లాహ్ సర్వజ్ఞానం కలవాడు, సకల విషయాలూ తెలిసినవాడూను."

(దివ్యఖుర్ఆన్ 49 : 13)

యుద్ధాలు, అలజడులకు ముఖ్య కారణం జాత్యహంకారాలు, ఘర్షణలు. ఈ సమస్యను పరిష్కరించడంలో ఖుర్ఆన్‌కు విజయాను భవం ఉంది. ఖుర్ఆన్ బోధనల వల్ల ఇస్లాంలో జాతి సహిష్ణుతకు మంచి రికార్డు ఉంది. ఇస్లామీయ ఆరాధనా సమావేశాలే దీనికి నిదర్శనం. జాతి సంకుచితత్వాన్ని లేక జాత్యాహంకారాన్ని ఖుర్ఆన్ పూర్తిగా తిరస్కరిస్తుంది. బ్రిటిష్ చరిత్రకారుడు ఆర్నాల్డ్ టోయిన్‌బీ ఇలా రాశారు:

జాతి నిర్మూలన చేతనత్వం ముస్లిములలో రావడం ఓ నైతిక విజయం. సమకాలీన ప్రపంచంలో ఇస్లామీయ మంచిని ప్రచారం చేయడం చాలా అవసరం. మానవాళికి అతి ముఖ్యమైన ఆధ్యాత్మిక పోరులో జాతి సహిష్ణుత శక్తులు ఓడిపోతున్నాయి. ఒకవేళ ఏదైనా బలమైన వ్యతిరేకత జాతి నిర్మూలన చేతనత్వంపై పైచేయి సాధిస్తే ఆ శక్తులు మళ్లీ పుంజుకుంటాయి. సకాలంలో ఇస్లాం స్ఫూర్తి పుంజుకుంటే అది శాంతి, సహనతల్లో సానుకూల నిర్ణయాత్మకం కాగలదు. (ఎ.జె.టొయన్‌బీ, సివిలైజేషన్ యాన్ ట్రయల్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ ప్రెస్, 1948, పేజీ 205-6)

ఇస్లాంను అపార్థం చేసుకునే అంశాల్లో జిహాద్ ఒకటి.

ఖుర్ఆన్‌ను మామూలుగా చదివినా కూడా జిహాద్ సైతం శాంతినే కాంక్షిస్తుందని అర్థమవుతుంది. జిహాద్ అంటే దైవ(అల్లాహ్) మార్గంలో సంఘర్షించడమే. దాని లక్ష్యం అరాచకత్వాన్ని తుద ముట్టించి శాంతిని స్థాపించడమేనని ఖుర్ఆన్ పేర్కొంటోంది.

"పీడన (ఫిత్నా) అంతమయ్యేవరకు, దైవధర్మం స్థాపించబడేవరకు మీరు వారితో యుద్ధం చేస్తూనే ఉండండి. తరువాత వారు దానిని మానుకుంటే, దౌర్జన్యపరులను తప్ప మరెవ్వరినీ శిక్షించకూడదు." *(దివ్యఖుర్ఆన్ 2 : 193)*

ఆచరణీయ ధర్మశాస్త్రమయిన ఖుర్ఆన్ ఇతర నాగరిక చట్ట విధానం వంటిదే. ఖుర్ఆన్ శాంతి, న్యాయం స్థాపించాలన్న లక్ష్యానికే అనుమతినిస్తుంది. అన్ని పద్ధతులు పాటించిన పిదపనే, తుదకు కఠినమైన షరతులు, నైతిక నియంత్రణల మేరకే జిహాద్‌కు దిగాలని పేర్కొంది.

యుద్ధ నీతిలో ఖుర్ఆన్ మొదటి సిద్ధాంతం :

"మీతో పోరాడేవారితో మీరూ అల్లాహ్ మార్గంలో పోరాడండి. కాని హద్దులు అతిక్రమించకండి. హద్దులు అతిక్రమించేవారిని అల్లాహ్ ప్రేమించడు." *(దివ్యఖుర్ఆన్ 2 : 190)*

ఖుర్ఆన్ ఇంకా ఇలా వివరించింది :

"దౌర్జన్యపరులను తప్ప మరెవ్వరినీ శిక్షంచకూడదు."

(దివ్యఖుర్ఆన్ 2 : 193)

శత్రు వైఖరి కలిగినవారిని ప్రేమతో, మంచి పనులతో ఎదుర్కో మని తన అనుసరులకు ఖుర్‌ఆన్ ప్రబోధించింది.

"మంచీ చెడు ఒకటికావు. నీవు చెడును శ్రేష్ఠమైన మంచి ద్వారా తొలగించు. అప్పుడు నీ పట్ల శత్రుభావం కలవాడు నీకు ప్రాణ స్నేహితుడు అయిపోవటాన్ని నీవు గమనిస్తావు." *(41: 34)*

ఈ బోధనలతోనే మానవ చరిత్రలో శాంతియుత విప్లవం సాధ్యమయింది. రెండు పెద్ద సామ్రాజ్యాలు కూలిపోయాయి. ఓ పెద్ద సామాజిక, రాజకీయ, ఆధ్యాత్మిక మార్పు వచ్చింది. ప్రవక్త ముహమ్మద్(స) చేసిన అన్ని యుద్ధా లలో కలిపి మొత్తం చనిపోయిన వారు 1016 మాత్రమే (ఇది కమ్యూనిస్టు విప్లవంలో చనిపోయిన లక్షలాది మంది కంటే, ఫ్రెంచియుద్ధంలో చనిపోయిన లక్షలాది మందికంటే, మహా భారత యుద్ధంలోచనిపోయిన కోట్లాది మంది కంటే తక్కువే). ఇలాంటిది మానవ చరిత్రలో అంతకు ముందెన్నడు జరుగనట్టిది.

గాంధీజీ అంటారు :

"నేను ఖుర్‌ఆన్ చదివాక అర్థం చేసుకున్నది ఏమిటంటే ఇస్లాం హింసాత్మకమైనది కాదు. పైగా శాంతిని కోరేది. ప్రతీకారం కంటే సహనా నికే అది పెద్దపీట వేస్తోంది. 'ఇస్లాం' అంటేనే శాంతి. అంటే అహింస." (గాంధీ మార్గ్, సంపుటి 25, నంబర్ 3, అక్టోబరు –డిసెంబరు 2003)

మానవ ప్రాణానికి ఖుర్‌ఆన్ అత్యంత విలువనిచ్చింది. ఒక్క మనిషిని చంపినా మొత్తం మానవాళిని చంపినట్టేనని ఖుర్‌ఆన్ ప్రకటించింది.

"హత్యకు బదులుగా గానీ లేదా కల్లోలాన్ని వ్యాపింపజేసినందుకుగాని కాక మరే కారణంవల్లనైనా ఒక మానవుణ్ణి చంపినవాడు సమస్త మానవులను చంపినట్లే. ఒక మానవుడి ప్రాణాన్ని కాపాడినవాడు మొత్తం మానవుల ప్రాణాలను కాపాడినట్టే."

(దివ్యఖుర్‌ఆన్ 5 : 32)

మహిళల విమోచనే ఖుర్‌ఆన్ అభిమతం

ప్రస్తుత కాలంలో మహిళల విమోచన, స్వేచ్ఛ అనేవి ప్రధాన సమస్యలు. మహిళలకి గౌరవం, హోదా ఇవ్వని ఏ సమాజం కూడా ఆదర్శ సమాజం అని చెప్పుకోలేదు.

స్త్రీ, పురుషులు ఒకే మూలం నుంచి వచ్చారని ఖుర్‌ఆన్ తెలిపింది.

"మానవులారా! మీ ప్రభువుకు భయపడండి. ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణి నుండి పుట్టించాడు. అదే ప్రాణి నుండి దాని జతను సృష్టించాడు. ఇంకా ఆ జంట ద్వారా ఎంతోమంది పురుషులను, స్త్రీలను అవనిలో వ్యాపింపజేశాడు..' *(దివ్యఖుర్‌ఆన్ 4 : 1)*

అల్లాహ్ ధర్మకర్తృత్వం, స్వాభావిక గౌరవం కేవలం ఆదమ్ యొక్క మగ సంతతికే పరిమితం కాదు. ఈ భూమిపైన అల్లాహ్ ధర్మ కర్తృత్వాన్ని, గౌరవాన్ని స్త్రీ పురుషులు ఉమ్మడిగా పంచుకుంటారు.

"మేము ఆదం సంతతికి పెద్దరికాన్ని ప్రసాదించాము. వారికి నేలపై, నీటిలో నడిచే వాహనాలను ప్రసాదించాము. వారికి పరిశుద్ధమైన వస్తువులను ఆహారంగా ఇచ్చాము. మేము సృష్టించిన ఎన్నో ప్రాణులపై వారికి స్పష్టమైన ఆధిక్యాన్ని అనుగ్రహించాము. ఇదంతా మా అనుగ్రహం." *(దివ్యఖుర్ఆన్ 17 : 70)*

మానవులుగా స్త్రీ పురుషులకు ఒకే రకమైన ఆధ్యాత్మిక, నైతిక విధులున్నాయని తెలిపింది దివ్యఖుర్ఆన్. తాము చేసే కర్మలకు ఎలాంటి లింగభేదం లేకుండా జవాబు చెప్పుకోవలసి ఉంటుంది.

"మీలోని ఎవరి శ్రమనూ నేను వృధాగా పోనివ్వను. పురుషుడైనా స్త్రీ అయినా మీరంతా ఒకే రాశికి చెందినవారు."

(దివ్యఖుర్ఆన్ 3 : 195)

"ప్రతి వ్యక్తి తాను సంపాదించే దానికి తాకట్టుగా వుంటాడు."

(దివ్యఖుర్ఆన్ 74 : 38)

"పురుషులు సంపాదించిన దానికి తగ్గట్టుగా వారి భాగం వుంటుంది. స్త్రీలు సంపాదించిన దానికి తగ్గట్టుగా వారి భాగం

వుంటుంది. అయితే అల్లాహ్‌ను ఆయన అనుగ్రహం కొరకు ప్రార్థిస్తూ వుండండి" నిశ్చయంగా అల్లాహ్ సకల విషయాల పరిజ్ఞానం కలవాడు." *(దివ్యఖుర్ఆన్ 4 : 32)*

పురిటిలోనే బాలికలను చంపేసే దురాచారాన్ని ఖుర్ఆన్ కఠినంగా హెచ్చరించింది. ఆ దురాచారాన్ని మొత్తం అరేబియా ప్రాంతంలో, ప్రపంచంలోని కొన్ని ఇతర ప్రాంతాలలో విజయవంతంగా నివారించింది.

"…. సజీవంగా పాతిపెట్టబడిన బాలికను, నీవు ఏ తప్పు వల్ల హత్య చేయబడ్డావని అడిగినప్పుడు…."

(దివ్యఖుర్ఆన్ 81 : 8,9)

లింగ పక్షపాతంపై ఖుర్ఆన్ కఠిన వైఖరిని ప్రదర్శించింది. మహిళల పట్ల ఎలాంటి వివక్షను ఖుర్ఆన్ సహించదు. భావోద్వేగాలు, అనుభూతుల విషయంలో సైతం ఎలాంటి వివక్షను దివ్యగ్రంథం సహించదు.

"వారిలో ఎవడికైనా కూతురు పుట్టిందనే శుభవార్తను అందజేస్తే అతడి ముఖాన్ని నల్లని ఛాయలు ఆవరిస్తాయి. అతడు లోలోన కుమిలిపోతాడు. ఈ దుర్వార్త విన్న తరువాత ఇక లోకులకు ఎలా ముఖం చూపాలి అని అతడు నక్కినక్కి తిరుగుతూ ఉంటాడు. అవమానాన్ని భరిస్తూ కూతుర్ని ఇంట్లో ఉంచు

> కోవాలా? లేక ఆమెను మట్టిలో పాతిపెట్టాలా? అని ఆలోచి స్తాడు– చూడు! వారు దేవుని విషయంలో చేసే నిర్ణయాలు ఎంత దుష్టమైనవో! *(దివ్యఖుర్ఆన్ 16 : 58, 59)*

పురుషులకున్నట్లే మహిళలకి భావప్రకటనా స్వేచ్ఛ ఉంది. ప్రవక్త(స)తో సైతం మహిళలు వాదించారని, చర్చలలో పాల్గొన్నారని ఖుర్ఆన్ అనేక సంఘటనలు తెలిపింది. మహిళల అభిప్రాయాలని అల్లాహ్ మన్నించాడు.

> ".... తన భర్త వ్యవహారంలో నీతో వాదిస్తూ ఉన్న, అల్లాహ్‌తో మొరపెట్టుకుంటూ ఉన్న స్త్రీ మాటలను అల్లాహ్ విన్నాడు. అల్లాహ్ మీ ఉభయుల సంభాషణను వింటున్నాడు; ఆయన అన్నీ వినేవాడు, అన్నీ చూసేవాడూను." *(దివ్యఖుర్ఆన్ 58:1)*

ఒప్పందాలు, వ్యాపారాలు చేయడానికి, స్వతంత్రంగా సంపాదించుకోవడానికి మహిళలకు సమాన హక్కులను ఖుర్ఆన్ ప్రసాదించింది. 'కుటుంబ యాజమాన్యం' అన్న భావాన్ని ఖుర్ఆన్ గుర్తించలేదు. ఎందుకంటే దానివల్ల మహిళలు ఆర్థిక దోపిడికి గురవుతారు. తన స్వాధీనంలో ఉన్నదానిని, విధులను నిర్వర్తించుకోవడానికి ప్రతి వ్యక్తికి స్త్రీ అయినా పురుషుడయినా సమాన హక్కు ఇవ్వబడింది.

"పురుషులు సంపాదించిన దానికి తగ్గట్టుగా వారి భాగం

వుంటుంది. స్త్రీలు సంపాదించిన దానికి తగ్గట్టుగా వారి భాగం వుంటుంది." *(దివ్యఖుర్ఆన్ 4 : 32)*

తన స్రీతత్వాన్ని కాపాడుకునేందుకు మహిళలకు పూర్తి రక్షణను ఖుర్ఆన్ కల్పించింది. పాశ్చాత్య సమాజం మహిళను విలాస వస్తువుగా చేసినట్లు కాక ఖుర్ఆన్ ఆమెకో గుర్తింపును, సౌశీల్యతను ప్రసాదించింది. స్త్రీతత్వాన్ని గౌరవించడమేకాక మహిళలకు హక్కులు, రక్షణ ఇవ్వడంలో ఇస్లాం ధర్మం ప్రత్యేకంగా నిలబడింది.

"మగ, ఆడ జాతుల్ని సృష్టించిన వాడి సాక్షిగా! వాస్తవంగా మీరు చేసే ప్రయత్నాలు (కార్యక్షేత్రాలు) విభిన్న రకాలుగా వుంటాయి."

(దివ్యఖుర్ఆన్ 92 : 3,4)

"మగవారికి మహిళలపై వున్నటువంటి హక్కులే ధర్మం ప్రకారం మహిళలకు కూడా మగవారిపై వున్నాయి."

(దివ్యఖుర్ఆన్ 2 : 228)

మహిళలకు పూర్తి ఆర్థిక హక్కులయితే ఉన్నాయి కానీ ఎలాంటి బాధ్యతలు లేవు. ఆమె పోషణ భారం చూడాల్సిన విధి ఆమె భర్తదే. తన భర్తకన్నా ధనవంతురాలయినా కూడా ఆమె పోషణ భారం భర్తదే.

"పురుషులు స్త్రీలపై వ్యవహార కర్తలు."

(దివ్యఖుర్ఆన్ 4 : 34)

పురుషులు తమ స్త్రీలను గౌరవించాలని, వారి దోషాలను ఎంచ కూడదని ఖుర్ఆన్ తెలిపింది.

"…. వారితో సద్భావంతో జీవితం గడపండి. ఒకవేళ మీకు వారు నచ్చకపోతే, బహుశా మీకు ఒక విషయం నచ్చకపోవచ్చు. కాని అందులోనే అల్లాహ్ఎంతో మేలును పెట్టివుండవచ్చు."

(దివ్యఖుర్ఆన్ 4 : 19)

ఆధునిక మహిళను చికాకు పరుస్తున్న ముఖ్యాంశాలు వేధింపు, బాధింపు. అన్ని రకాల వేధింపులకు ఖుర్ఆన్ ఆదిలోనే అడ్డుకట్ట వేసింది. మహిళలు ఎదురుపడ్డప్పుడు పురుషులు తమ దృష్టిని నేల వైపు మరల్చాలని, వారిని కోరిక దృష్టితో చూడరాదని ఖుర్ఆన్ సూచించింది. మహిళల పవిత్రత, సౌశీల్యత, భద్రతలు కాపాడాలంటోంది.

"విశ్వసించిన పురుషులకు తమ చూపులను కాపాడుకోండి అని …. చెప్పు" *(దివ్యఖుర్ఆన్ 24 : 30)*

సంపూర్ణ సాఫల్యం - ఖుర్ఆన్ సంకల్పం

ఈ ప్రపంచంలో సాఫల్యానికి మారుపేరు సంతృప్తి. ఆస్తి, ఐశ్వర్యం, అందం, పేరు, హోదా… చివరికి మనిషి ఆనందం, సంతృప్తినే కాంక్షిస్తాడు. ఒకవేళ ప్రపంచ ఆశయం, న్యాయం, శాంతి, సమానత్వం, ఉద్రిక్తరహిత సమాజం నెలకొనడం అయితే ప్రపంచం లోని జనులు కోరుకునేది సంతృప్తినే. ప్రతి ఒక్కరూ సంతృప్తి కోసమే

కష్టపడుతున్నారు. ప్రతి ఒక్కరికి విజయవంతమైన, సంతృప్తికరమైన జీవితం అందిస్తానంటోంది ఖుర్‌ఆన్.

ఇతర సిద్ధాంతాల మాదిరిగానే విజయానికి పునాది బలమైన విశ్వాసమేనని ఖుర్‌ఆన్ పేర్కొంటోంది. విశ్వాస పద్ధతి ద్వారా మనిషిలో పాజిటివ్ వైఖరిని, సమతుల్య ప్రవర్తనను, తుదకు విజయం, సంతృప్తిని అందిస్తుంది ఖుర్‌ఆన్. (దైవం) అల్లాహ్‌పట్ల దృఢమైన విశ్వాసాన్ని నాటుతోంది ఖుర్‌ఆన్. ఈ విశ్వంలో జరుగుతున్నదంతా ఒక ప్రణాళిక ప్రకారం జరుగుతోంది. అల్లాహ్ యందు విశ్వాసం ఉంచడం వల్ల మనిషిలో నిర్భీతి, ధైర్యం, ఆశావాదం, ఆత్మవిశ్వాసం, వ్యవహార దక్షత పెంపొందుతాయి.

1. చాలామంది జీవితాలు భయం, అభద్రతా భావం కారణంగా దుర్భరమవుతున్నాయి. ఈ జీవితాన్ని ప్రసాదించి, తీసుకునేది అల్లాహ్‌యేనని విశ్వాసి ప్రగాఢంగా నమ్ముతాడు. కొంతకాలం మేరకే తనని ఈ భూమిపైన ఉంచాడని నమ్ముతాడు. అల్లాహ్ తలవనిదే ఎవరూ మరొకరికి హాని చేయరు. అల్లాహ్ పట్ల ఈ ప్రగాఢ నమ్మకమే మనిషిని నిర్భీతిపరుడిగా, ధైర్యస్థుడిగా ఉంచుతుంది.

> "…. ఇక మృత్యువు, మీరు ఎక్కడున్నాసరే అది మీకు వచ్చి తీరుతుంది, మీరు ఎంతటి దృఢమైన భవనాలలో ఉన్నా సరే…"
>
> *(దివ్యఖుర్‌ఆన్ 4 : 78)*

2. తమ పోషణ, తమ కుటుంబ పోషణ కోసం ప్రతి ఒక్కరు శ్రమించాలి. అందుకోసం కష్టపడాల్సినంత కష్టపడాలి.

"... నమాజు ముగిసిన తరువాత భూమిపై వ్యాపించండి, అల్లాహ్ అనుగ్రహాన్ని అన్వేషించండి." *(దివ్యఖుర్ఆన్ 62 : 10)*

ఎవరైనా సరే తన, తన కుటుంబం ఆర్థిక భద్రత గురించి చింతించాల్సిన అవసరంలేదు. దేవుని మాత్రమే నమ్ముకోవాలి. ఆయనే ఉపాధి ప్రదాత.

"తమ ఆహారాన్ని మోసుకుని తిరగని జంతువులు ఎన్నో ఉన్నాయి. అల్లాహ్ వాటికి ఉపాధిని సమకూరుస్తాడు, మీ ఉపాధి ప్రదాత కూడా ఆయనే. ఆయన అన్నీ వినేవాడూ, అన్నీ ఎరిగిన వాడూను." *(దివ్యఖుర్ఆన్ 29 : 60)*

"...ఇంకా అతని ఊహకు కూడా అందనటువంటి మార్గం ద్వారా, అతడికి ఉపాధి ప్రసాదిస్తాడు, అల్లాహ్‌ను నమ్ము కున్నవానికి అల్లాహ్‌యే చాలు. అల్లాహ్ తన పనిని పూర్తిచేసి తీరుతాడు. అల్లాహ్ ప్రతి దానికి ఒక విధి నిర్ణయించి ఉంచాడు." *(దివ్యఖుర్ఆన్ 65 : 3)*

ఈ నమ్మకంతోనే విశ్వాసి తన కుటుంబం కోసం చేయాల్సిందంతా చేస్తాడు. కానీ అతడెన్నడూ అవిశ్రాంతంగా కానీ లేక ఆర్థిక భద్రత విషయంలో ఆదుర్దాతోకాని ఉండడు. అతడి ప్రయత్నాలు, కృషి

ఫలించినా ఫలించకపోయినా నిత్యం ప్రశాంత చిత్తంతోనే ఉంటాడు.

3. శారీరక, ఆర్థిక భద్రతతోపాటు జనులు తమ చుట్టూ జరిగే వాటి విషయంలో కూడా భయాందోళనలతో ఉంటారు. తాము కోరుకున్న రీతిలో పరిస్థితులు ఉండకపోతే వారు అశాంతి, కలతతో ఉంటారు. ఈ ప్రపంచంలో జరిగే వాటనన్నింటినీ మనం నియంత్రించలేమని ఖుర్‌ఆన్ తెలుపుతోంది. అన్నింటిని నియంత్రించేది అల్లాహ్‌యే అంటోంది. అన్నీ తెలిసినవాడు, సర్వజ్ఞుడు ఆయన ఒక్కడే అంటుంది. జరిగేదంతా ఆయన ప్రణాళిక ప్రకారమే, పథకం ప్రకారమే జరుగుతోందంటోంది. ఈ ప్రపంచంలో జరిగే వాటి వెనుక ఆయన పథకం ఏమిటో పరిమిత జ్ఞానం గల మానవులు అర్థం చేసుకోలేరు.

> "... భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ ఆయనదే. ఆయన సమ్ముఖంలో ఆయన అనుజ్ఞ లేకుండా సిఫారసు చెయ్యగలవాడెవ్వడు? ప్రజల ముందు ఉన్న దానినీ ఆయన ఎరుగును. వారికి గుప్తంగా ఉన్నదీ ఆయనకు తెలుసు. ఆయన స్వయంగా తెలియజెయ్యాలని అభిలషిస్తే తప్ప ఆయనకున్న జ్ఞాన విశేషాలలోని ఏ విషయమూ వారి గ్రహణ పరిధిలోకి రాదు. ఆయన రాజ్యాధికారం ఆకాశాలనూ భూమినీ పరివేష్టించి ఉన్నది. వాటి సంరక్షణ ఆయనకు ఎంతమాత్రం అలసట కలిగించదు. ఆయన మాత్రమే సర్వాధికుడు, సర్వోత్తముడూను."

(దివ్యఖుర్‌ఆన్ 2 : 255)

ఎవరైనా సరే తమ విధులను తమకు చేతనైనంత బాగా నిర్వర్తిం చాలి. కానీ ఫలితాలు తమ నియంత్రణలో ఉండవన్న దృఢాభిప్రాయం తోనూ ఉండాలి. తమ విధిని చిత్తశుద్ధితో చేశాక ఫలితాన్ని దైవానికి వదిలివేయాలి. కృషి ఫలితం గురించి ఆలోచించకూడదు. అతడి భూమిక ఎంతో ఆ మేరకే అతడికి ఫలితం దక్కుతుంది. ఈ వైఖరి మనిషిని విచలి తుడిని, అధైర్యస్తుడిని చేయదు.

4. అల్లాహ్, విధి విషయంలో బలమైన నమ్మకాన్ని నూరిపోసే ఖుర్‌ఆన్ విశ్వాసులను ఖర్మవాదులుగా మార్చదు. అన్నింటిని నియం త్రించే వాడు అల్లాహ్ అనీ, జీవన స్థితిగతులన్నింటా ఆయనదే సరైన నిర్ణయం అని విశ్వాసి నమ్ముతాడు. అయితే అల్లాహ్‌ను విశ్వసించడం వల్ల విశ్వాసి నిష్క్రియాపరుడు, నిశ్చలుడు అయిపోడు. కష్టాలు తగ్గించుకునేందుకు కృషి చేయాలనీ, ఫలితాలు సాధించాలని అతడికి నిర్దేశించబడింది.

> "యదార్థం ఏమిటంటే, ఒక జాతి స్వయంగా తన లక్షణాలను మార్చుకోనంత వరకు అల్లాహ్ దాని స్థితిని మార్చడు."
>
> *(దివ్యఖుర్‌ఆన్ 13 : 11)*

ఇదే ప్రేరకమైన మంచి సిద్ధాంతం. పూనిక, కృషిని అందిస్తోంది. రిస్క్ తీసుకునే సామర్థ్యాన్ని పెంచుతుంది. మనుషుల్ని శక్తిమంతులు, ఆశావహులుగా చేస్తోంది. ఈ నమ్మకం ఎల్లప్పుడు ఆశయ సాధనకే

పురికొల్పుతుంది కానీ నిర్వేదాన్ని కలిగించదు. పూనిక కలిగిస్తుందే తప్ప నష్టాన్ని, గుండె మంటని కలిగించదు.

"ఒకవేళ మీ విజయాలన్నింటిని కుప్పగా పోసి ఒక్కసారి రిస్క్ తీసుకుంటే... మీరు ఓడిపోతే, మళ్ళీ మొదలుపెడతారు. కానీ ఎప్పటికీ మీ నష్టం గురించి ఒక్కమాట చెప్పరు."

రుడ్‌యార్డ్ కిప్లింగ్ చెప్పిన పై మాటలు ఖుర్ఆన్ విశ్వాసాల ఆధారంగా చెప్పినవే.

5. విశ్వాసం స్థిరంగా వెలిగేలా ఓ సంపూర్ణ విధానాన్ని ఖుర్ఆన్ రూపొందించింది. ఈ తాత్కాలిక ప్రపంచ విషయాలని వదిలివేసి రోజుకు ఐదు పూటలా దేవుని సన్నిధిలో ప్రార్థించమంటోంది. వారిని నమ్మకం ద్వారా అల్లాహ్ నుంచి కొత్త శక్తిని కోరమంటోంది. ప్రతి బాధని, భయాన్ని, సమస్యని దుఆగా మార్చుకోమంటోంది. తన అవసరాలు, కష్టాలు చిత్తశుద్ధితో అల్లాహ్‌కు నివేదించడం ద్వారా విశ్వాసి తన బాధ్యతను విశ్వ ప్రభువుకి వదిలేసి బాధను తగ్గించుకుంటున్నాడు. ఆత్మ తృప్తిని పొందు తున్నాడు. తన అవసరం తీరకపోయినా మంచే జరిగిందన్న సాంత్వన పొందుతున్నాడు. అల్లాహ్ అతడికి చేసేదంతా చివరికి మంచే అవుతుంది.

"నీ ప్రభువు ఇలా అంటున్నాడు, "నన్ను ప్రార్థించండి, నేను మీ ప్రార్థనలను అంగీకరిస్తాను." *(దివ్యఖుర్ఆన్ 40 : 60)*

"ఆయనను మాత్రమే వేడుకోవడం ధర్మం. ఇక వారు ఆయనను వదిలి వేడుకుంటున్న ఇతర శక్తులు– అవి వారి ప్రార్థనలకు ఏ సమాధానమూ ఇవ్వలేవు. వాటిని వేడుకోవటం ఒక మనిషి నీళ్ళ వైపు చేతులు చాచి, దానిని 'నీవు నా నోటిదాకా వచ్చెయ్యి" అని అభ్యర్థన చేసిన మాదిరిగా ఉన్నది. వాస్తవానికి నీరు అతని వద్దకు చేరటం జరుగదు. కనుక ఇదే విధంగా అవిశ్వాసుల ప్రార్థనలు కూడా గురిలేని బాణాలే తప్ప మరేమీ కావు."

(ఖుర్‌ఆన్ 13:14)

దివ్య ఖుర్‌ఆన్

- ✔ మానవాళి మార్గదర్శకత్వం కోసం దైవం పంపిన చివరి గ్రంథం.
- ✔ గాలి, నీరు, వెలుతురులా అది అందరి సొత్తు
- ✔ అది మానవుని సంపూర్ణ జీవితానికి సమగ్ర సంవిధానాన్ని ప్రసాదిస్తుంది.
- ✔ అది కేవలం పూజా పురస్కారాలకు, నీతి నియమాలకు పరిమితమయిన గ్రంథం కాదు.
- ✔ అది స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించి వ్యక్తికీ, సమాజానికీ, సమాజం లోని అన్ని వర్గాలకూ సర్వతోముఖమైన ప్రగతీ వికాసాలు సాధించే అవకాశాలు దొరకా లని కోరుకుంటుంది.
- ✔ రండి, నేడే దివ్యఖుర్‌ఆన్ అధ్యయనా నికి సమాయత్తమవుదాం.